

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం సిటీ : ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసు కోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అసంక్రమిత వ్యాధులపై జల్లెడ

జిల్లాలో ఏటికేడు అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సిడి) బారిన పడుతున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ప్రధానంగా బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువవుతున్నారు. ముఖ్యంగా భయంకరమైన కేన్సర్ సోకి ఆస్పత్రుల పాలవుతున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం 3.0లో సర్వే చేసింది. అయితే అందులో కేన్సర్‌కు సంబంధించి సంతృప్తికరమైన ఫలితాలు రాకపోవడంతో, మరింత సమగ్రంగా సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్‌సిడి-4.0 సర్వే పేరుతో ఈ నెలలో ఇంటింటా సర్వే చేపట్టనుంది. కేన్సర్, బిపి, షుగర్‌తో పాటు అదనంగా లివర్, టిబి వ్యాధుల పైనా సర్వే చేపట్టేందుకు సిద్ధమవుతోంది. సర్వే కోసం వైద్యారోగ్యశాఖ బృందాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది.



ఎంసిడి 4.0 సర్వేపై దిశానిర్దేశం చేస్తున్న డిఎంహెచ్‌ఒ అనిత (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అసంక్రమిత వ్యాధులు (ఎన్‌సిడి)పై రాష్ట్రవ్యాప్తంగా గతేడాది నవంబరులో ప్రభుత్వం సర్వే మొదలుపెట్టింది. అదే రోజు జిల్లాలో కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురంలో జిల్లా అధికారులు ప్రారంభించారు. తర్వాత ఎఎన్‌ఎం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు కలిసి జిల్లాలో 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరి ఇంటికి వెళ్లి సర్వే చేశారు. కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. దీంతో 18 ఏళ్లు దాటిన యువతులకు కేన్సర్ సంబంధిత లక్షణాలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. సర్వేలో అనుమానిత లక్షణాలున్న వారిని పిహెచ్‌సిల్లోని వైద్యాధికారికి దగ్గరకు తీసుకెళ్లారు. వైద్యాధికారులు మరోసారి క్షుణ్ణంగా వారిని పరీక్షించి వ్యాధుల బారిన పడిన వారిని మందులు తీసుకోవాలని సూచించారు. కేన్సర్ లక్షణాలు ఏమైనా ఉంటే శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు.

మహిళల్లో మూడు రకాల కేన్సర్‌పై సర్వే

సర్వేలో మహిళలకు సంబంధించి మూడు రకాల కేన్సర్ పరీక్షలను నిర్వహించారు. కేన్సర్ లక్షణాలు బయటకు కనిపించకపోయినా పలురకాల పరీక్షల తర్వాత వారికి కేన్సర్ నిర్ధారణ అయింది. సర్వేలో జిల్లాలో 3,357 మందికి నోటి కేన్సర్ లక్షణాలు కనిపించాయి. వారిలో 3,142 మందికి తదుపరి పరీక్షలు నిర్వహించగా 39 మందిని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. అదేవిధంగా 1,850 మందికి బ్రెస్ట్ కేన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించారు. వారిలో 1793 మందికి మెడికల్ ఆఫీసర్లు పరీక్షలు నిర్వహించగా 45 మందిని రిఫర్ చేశారు. అదేవిధంగా 1,778 మందికి గర్భాశయ కేన్సర్ లక్షణాలు ఉన్నట్లుగా గుర్తించారు. మెడికల్ ఆఫీసర్లు 1728 మందికి తదుపరి పరీక్షలు నిర్వహించగా 16 మందిని రిఫర్ చేశారు.

- **ఈ నెలలో ఎన్‌సిడి 4.0 సర్వే**
- **ఇప్పటికే 3.0లో కేన్సర్, రక్తపోటు, షుగర్‌పై సర్వే**
- **సర్వేలో కొత్తగా లివర్, టిబి వ్యాధులు చేర్పు**
- **బృందాలను సిద్ధం చేస్తున్న వైద్యారోగ్యశాఖ**

8,106 మందికి బిపి... 4,548 మందికి షుగర్

ఎన్‌సిడి సర్వే 3.0 సర్వేలో జిల్లాలో 18 ఏళ్లు దాటిన వారిని మొదట గుర్తించారు. జిల్లాలో అటువంటి వారు 18,97,550 మంది ఉన్నారు. వీరిలో వలసలు వెళ్లిన వారు, మరణించిన వారు 16,35,292 మందికి సర్వే చేయాల్సిన అవసరం పడుతుందని గుర్తించారు. ఇప్పటివరకు 13,17,805 మందికి స్క్రీనింగ్ చేశారు. వారిలో 73,486 మంది అధిక రక్తపోటు అనుమానిత లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. రెండో దశలో పిహెచ్‌సిలోని వైద్యులు వారిలో 8,106 మందికి బిపి ఉన్నట్లుగా నిర్ధారణ అయింది. ఇక షుగర్ వ్యాధికి సంబంధించి చేసిన సర్వేలో 52,136 మందికి అనుమానిత లక్షణాలు కనిపించాయి. పిహెచ్‌సి వైద్యులు పరీక్షల్లో 4,548 మందికి షుగర్ వ్యాధి నిర్ధారణ అయింది.

కొత్తగా లివర్, టిబి వ్యాధులపై సర్వే

ఇటీవలి కాలంలో లివర్, టిబి వ్యాధిగ్రస్తుల సంఖ్య కూడా క్రమేణా ఎక్కువ అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే ఎన్‌సిడి 4.0 సర్వేలో ఆ రెండు వ్యాధులను ప్రభుత్వం చేర్చింది.

సర్వేపై సందేహాలు

వైద్యారోగ్యశాఖ అధికారులు చేపట్టిన సర్వేపై అనేక సందేహాలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వే చేసిన ఎఎన్‌ఎం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. అయితే చాలాచోట్ల ఇళ్లకు వెళ్లకుండానే ఫోన్‌లో వివరాలు తెలుసుకుని నమోదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో కచ్చితమైన ఫలితాలు రాకపోవడానికి అదో కారణంగా ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర వైద్యారోగ్యశాఖ లెక్కల ప్రకారం మహిళల్లో కేన్సర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువవుతున్నట్లు లెక్కలు చెప్తున్నాయి. రాష్ట్రంలో మాత్రం ఆ రకమైన ఫలితాలు కనిపించలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఎన్‌సిడి 4.0 సర్వే పేరుతో 18 ఏళ్లు దాటిన వారందరికీ సర్వే చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

అక్టోబరు 4, 5న సిఐటియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సిఐటియు జిల్లా 12వ మహాసభలను అక్టోబరు 4, 5 తేదీల్లో సోంపేటలో నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరల పెరుగుదల, అవసరాలను దృష్టిలో పెట్టుకుని కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు, అంగన్వాడీ, ఆశ తదితర స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. వారికి కనీస వేతనం ఇవ్వడంతో పాటు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో శ్యామ్‌పిస్టన్స్ ప్లాంట్-2, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమల కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చి వేతన ఒప్పందాలు చేయాలని, అక్రమంగా నిలుపుదల చేసిన కార్మిక నాయకులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. విఆర్‌ఎలకు కనీస టైమ్ స్కేల్ అమలు చేయాలని, రాత్రి కాపలా డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు, జట్టు, ముఠా కళాసీలు, అసంఘటిత కార్మికులు దుర్భర పరిస్థితుల్లో బతుకీడుస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. పని భద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్‌ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం, పని గంటలు పెంచుతూ చట్టాల్లో మార్పులు చేశాయన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్‌ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్‌ఐ, బోనస్‌లపై ఉన్న సీలింగ్ ఎత్తివేయాలన్నారు. ఈ నేపథ్యంలో సిఐటియు జిల్లా మహాసభలు అక్టోబరు 30, 31 తేదీల్లో, అఖిల భారత మహాసభలు మొట్టమొదటిసారిగా విశాఖపట్నంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలను ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్‌వర్కర్లు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు అల్లు మహాలక్ష్మి, జి.అమరావతి, ఎం.ఆదినారాయణ మూర్తి, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎన్.వి.రమణ, ఎన్.గణపతి పాల్గొన్నారు.



పేకాట శిబిరంలో పట్టుకున్న వారితో ఎస్ఐ

9 మంది జూదరుల అరెస్టు

పొందూరు: పొందూరు మండలం పరిధిలోని లోలుగు నుంచి వి.ఆర్.గూడెం వెళ్లే రహదారిలోని తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి 9 మందిని పట్టుకున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందించిందని పేర్కొన్నారు. ఈ మేరకు పేకాట శిబిరంపై దాడి చేయగా శ్రీకాకుళానికి చెందిన ఆరుగురు, లోలుగు గ్రామానికి చెందిన ముగ్గురిని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,02,360ల నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: మండలంలోని బుడగట్లపాలెం సమీపంలో రొయ్యల చెరువులో పనిచేస్తున్న గార మండలం తోనంగి పంచాయతీ బచ్చువానిపేటకు చెందిన బచ్చు రామారావు (44) శనివారం రాత్రి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగేళ్లుగారియల్ చెరువు వద్ద పనిచేస్తున్న రామారావు రొయ్యల చెరువులో నీరు నింపేందుకు మోటార్ స్విచ్ ఆన్ చేశారు. వెంటనే షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కూలీలు ఆస్పత్రికి తరలిస్తుండగా... మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎకో టూరిజంలో తేలినీలాపురం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

విదేశీ పక్షులకు అవాసంగా ఉన్న తేలినీలాపురాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీనిచ్చారు. మండలంలోని తేలినీలాపురం పర్యాటక కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎకోటూరిజంలో తేలినీలాపురంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ ఇప్పటికే పలు ప్రతిపాదనలు రూపొందించిందన్నారు. పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు వీలుగా విడిది సౌకర్యాలు చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రాంతంలో మూలపేట పోర్టు నిర్మాణం జరుగుతోందని రానున్న రోజుల్లో పారిశ్రామిక కేంద్రంగా మారనుందని వివరించారు. టెక్కలి ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందడానికి మౌలిక వసతులు సమకూరుస్తామన్నారు. మూలపేట నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఇది పూర్తయితే తీర ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ, ఎల్.ఎల్. నాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



సంతబొమ్మాళి:పర్యటిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సకల సౌకర్యాలతో పురావాస కాలనీ

సంతబొమ్మాళి: మండలంలోని మూలపేట పోర్టు నిర్మాణం కారణంగా మూలపేట, విష్ణుచక్రపురం గ్రామాల నిర్వాసితులకు కల్పించిన పునరావాస కాలనీలో సకల మౌలిక వసతులు కల్పించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం కస్పా నౌపడ సమీపంలో మూలపేట పోర్టు నిర్వాసిత కాలనీలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆదివారం పర్యటించారు. నిర్వాసిత కాలనీలో రూ.32 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూలపేట, విష్ణుచక్రపురం నిర్వాసితులకు పునరావాసం కింద సమగ్ర ప్రణాళికతో అన్ని విధాలా మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. పునవాస కాలనీలో సకల సౌకర్యాలు కల్పించి ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కాలనీ నిర్మాణం పూర్తయిన తర్వాత, ఇది ఒక మోడల్ రీసెటిల్‌మెంట్‌గా నిలుస్తుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టనున్న పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యాన అన్ని పనులు చేపట్టాకే మూలపేట గ్రామాన్ని తరలిస్తామన్నారు. విద్యుదీకరణ, పాఠశాల భవనం, అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, యువకేంద్రం, రోడ్లు, కాలువలు తదితరులు పనులకు శంకుస్థాపన చేశారు. మూడు మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అంతకుముందు ఇజ్జవరం రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవం చేశారు. నిర్వాసిత కాలనీలో విష్ణుచక్రం గ్రామస్తులు నిర్మించుకుంటున్న ఇళ్లను పరిశీలించి నిర్వాసితుల ఇబ్బందులు తెలుసుకున్నారు. నిర్వాసితు కాలనీలో మూలపేటకు శ్మశానం వాటిక సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ హేమసుందర్, ఎంపిడిఒ జయంతిప్రసాద్, నీటిపారుదల, ఆర్అండ్‌బి, విద్యుత్, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు, జనసేన నాయకులు కణితి కిరణ్‌కుమార్, టిడిపి నేతలు సుగ్గు శాంతి స్వరూప్‌రెడ్డి, బొడ్డేపల్లి సత్యనారాయణ, జీరు భీమారావు, వాడరేవు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సిపిఐ జాతీయ కార్యదర్శి

నారాయణ పర్యటన

కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాలు సందర్శన

ప్రజాశక్తి - శ్రీకాకుళం



వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఈ నెల 12వ తేదీన పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ పోరాటానికి మద్దతుగా ఆయన పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో స్థానికుల భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పలురూపాల్లో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యాన పలురూపాల్లో ఆందోళనలు చేపట్టినట్లు గుర్తుచేశారు. వామపక్షాల ఆధ్వర్యాన ప్రభావిత గ్రామాల్లో పర్యటన కూడా జరిగిందని, ఈ ఉద్యమం మరింత బలోపేతమయ్యేందుకు నారాయణ పర్యటించనున్నారని తెలిపారు. మందస మండలం రాంపురంలో ఆయన పర్యటన ప్రారంభమై పలు గ్రామాలు పర్యటిస్తారని తెలిపారు. ఈ పర్యటనలో యువజన, విద్యార్థి, ప్రజాసంఘాలు, వామపక్ష నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

రైతు అభ్యున్నతే లక్ష్యం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రైతుల అభ్యున్నతి, వ్యవసాయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పంట ఉత్పాదకతను మెరుగుపరచేందుకు, మార్కెట్ సౌకర్యాలను విస్తరించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఇటీవల రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామన్నారు. జిల్లాలో 2,74,208 మంది రైతులకు రూ.186 కోట్లు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని అన్నారు. పంటల పెట్టుబడి ఖర్చుల కోసం పథకం నగదు ఉపయోగపడ్డాయని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ త్రినాథస్వామి, జగన్మోహనరావు, టిడిపి నాయకులు కర్రి అప్పారావు, సాసుమహంతి ఆనందరావు, రోణంకి లీలామోహన్, వెలమల కామేశ్వరరావు పాల్గొన్నారు.


జనార్ధనరావుకు అభినందనలు

నందిగాం మండలం పాలవలసలో చిన్న రైతు కుటుంబంలో జన్మించిన రుంకు జనార్ధనరావు ఉమ్మడి ఆంధ్రాలో 2012 పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జంతుశాస్త్ర అధ్యాపకుడిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. అప్పటి నుంచి ఇంటర్మీడియట్ మొదటి, రెండు సంవత్సరాల విద్యార్థుల కోసం తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో పరీక్షలకు సులభతరంగా ఉండే విధంగా స్టడీ మెటీరియల్‌ను, ప్రయోగ దీపికలను తయారు చేశారు. ఇవి రాష్ట్రవ్యాప్తంగా అధ్యాపకులు విద్యార్థులతో విశేష ఆదరణ పొందింది. ఈ సంవత్సరం సిలబస్ మారడంతో ఈ పుస్తకాలను మరలా నవీకరించారు. ఈ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని పాఠ్య పుస్తకాలు తయారుచేసి భావితరాలకు అందేలా కృషి చేయాలని అభినందించారు.

ఆర్థిక ప్రగతికి బ్యాంకులు దోహదం

- **ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత ప్రచారం**
- **మహిళల జీవనోపాధికి ప్రాధాన్యత**
- **సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**
- **జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాసరావు**





ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గ్రామీణ స్థాయి వరకు బ్యాంకు సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు తెలిపారు. పలురకాల రుణాలు అందజేసి ప్రజల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నాయని చెప్పారు. పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచారం, ఒటిపి, పిన్ నంబర్లను బ్యాంకులు అడగవని స్పష్టం చేశారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను ఆయన వెల్లడించారు.

? డిజిటల్ సూక్ష్మ రుణ ప్రణాళిక అమలు తీరు ఎలా ఉంది?

ప్రధానంగా మహిళల జీవనోపాధులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. జిల్లాలో 48 వేల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. సంఘానికి అర్హత బట్టి ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నాం. రుణంలో 30 శాతం వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకున్నా, 70 శాతం జీవనోపాధులకు ఉపయోగపడాలి. వ్యాపార యూనిట్లు మహిళలు ప్రారంభించి ఆర్థికంగా ముందుకు సాగాలి. మహిళలు వ్యాపారులుగా మారాలి. వ్యాపారం నిర్వహణపై శిక్షణ సైతం ఇస్తున్నాం. పచ్చళ్ల తయారీ, నాటుకోళ్ల పెంపకం, అప్పడాల తయారీ, చింతపండు వ్యాపారం ఇలా అనేక వ్యాపారాల్లో మహిళలు రాణిస్తున్నారు.

? రైతులు, కౌలు రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు అందిస్తున్నారా?

శతశాతం రైతులకు రుణాలందించేలా బ్యాంకులు ముందుకు సాగుతున్నాయి. జిల్లాలో 6.5 లక్షల మంది రైతులకు రూ.834 కోట్లు రుణాలు అందజేశాం. వన్ బి సమస్యలు ఉంటే తహశీల్దార్ ధ్రువీకరణ పత్రం ఆధారంగా రుణాలు ఇస్తున్నాం. జిల్లాలో కౌలు రైతులు 7,332 మందికి సిసిఆర్‌సి కార్డులు ఉండగా, తక్కువ మందికి రుణాలు అందాయి. 11 నెలలకే ఈ కార్డు వర్తించడం వల్ల రుణాల మంజూరులో కొన్ని సమస్యలు వస్తున్నాయి. అర్హులైన కౌలు రైతులకు రుణాలందించేలా ముందుకు సాగుతున్నాం.

? ఆర్థిక అక్షరాస్యతపై ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారు?

గ్రామాల్లో బ్యాంకు సేవలపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. గ్రామాలను దత్తత తీసుకుని ముందుకు సాగుతున్నాం. రైతులు, స్వయం సహాయ సంఘాలకు అర్హత బట్టి రుణాలు మంజూరు చేస్తున్నాం. సైబర్ నేరాలు, ఎన్‌పిసిఐ నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం బ్యాంకు ఖాతాలో ప్రభుత్వ పథకాల నగదు జమ చేస్తుంది. ఎన్‌పిసిఐ నమోదు కాకపోవడం వల్ల లబ్ధిదారులు నష్టపోతున్నారు. వీటిపై పూర్తి అవగాహన కల్పిస్తున్నాం.

? సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో ప్రజల్లో ఎటువంటి చైతన్యం కలిగిస్తున్నారు?

ఇతరుల పేరుతో ఫేక్ అకౌంట్లు కొనసాగుతున్నాయి. ఈ అకౌంట్‌ల ద్వారా సైబర్ క్రైమ్ జరుగుతుంది. విదేశాల్లో ఉన్న వారు సైతం ఈ క్రైమ్ చేయొచ్చు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ క్రైమ్ జరిగితే మొదటి గంటలోపు 1930 నంబరుకు ఫోన్ చేయాలి. దీనివల్ల డబ్బులు వెనక్కి పొందవచ్చు. జిల్లాలో ప్రస్తుతం తమ ఖాతా ఉందని తెలియని వ్యక్తుల పేర్లతో కొన్ని ఖాతాలు కొనసాగుతున్నాయి. వీటిని గుర్తించి సైబర్ క్రైమ్ నిలుపుదలపై దృష్టిసారిస్తున్నాం. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని ఒటిపి, పిన్ నంబర్లు, ఇతర వ్యక్తిగత సమాచారం అడిగినా ఎవరికీ చెప్పొద్దు. బ్యాంకులు ఎప్పుడూ ఇటువంటి వాటిని అడగవు.

? బ్యాంకు సేవలు ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఎటువంటి మార్పులు అమలు చేస్తున్నారు?

ప్రధానంగా జెఇఇ, నీట్, క్లాట్, ఇతర జాతీయ విద్యాసంస్థల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు విద్యా రుణం రూ.40 లక్షల వరకు గరిష్టంగా ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 600 విద్యాసంస్థలకు విద్యా రుణాలు వర్తింపజేస్తున్నాం. డ్రోన్ల కోసం 80 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు అందిస్తున్నాం. 20 యూనిట్లు జిల్లాలో అందజేశాం. ప్రభుత్వం అమలు చేస్తున్న పి-4కి మద్దతుగా పేదలకు వృత్తి విద్యా శిక్షణలు ఇస్తున్నాం. సిఎస్‌ఆర్ కింద పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాం.

? పిఎం సూర్యఘర్ పథకం అమలుకు బ్యాంకుల ప్రోత్సాహం ఎలా ఉంది?

జిల్లాలో పిఎం సూర్య ఘర్ పథకం కింద 15 వేల సోలార్ రూఫ్‌టాప్‌లకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రూ.2.20 లక్షల రుణం ఇస్తాం. రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా రుణాలు అందజేస్తాం. 40 శాతం సోలార్ విద్యుత్ వినియోగం లక్ష్యంగా ఈ పథకం అమలవుతోంది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిఐలు, ఎస్‌ఐలు రౌడీషీటర్లకు, నేర చరిత్ర గల వారికి, పాత నేరస్తులు, చెడు నడవడిక కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీకాకుళం రెండవ పట్టణం, గార, జలుమూరుతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ మేరకు పాత నేరస్తులు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ కార్యక్రమం చేపట్టారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించిదిలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. పోలీసు వారి ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన మరింత కేసులు నమోదు చేస్తామని తెలిపారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

ఎవరైనా సత్ప్రవర్తన మార్చుకోకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానితుల కదలికలను పోలీసు శాఖ ఎల్లపుడూ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, నేర ప్రవృత్తి విడనాడాలని హితవు పలికారు.

అన్నదాతను వీడని కష్టాలు

అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. ప్రతి ఏడాది వ్యవసాయానికి అవసరమైన సాగునీరు అందక రైతు కష్టాలు చవి చూస్తున్నాడు. పాలకవర్గం, ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

- ఎండుతున్న వరి నాట్లు
- కాపాడుకునేందుకు అవస్థలు
- అందని సాగునీరు
- ముఖం చాటేసిన వరుణుడు


ఎండుతున్న వరి పంట

ప్రజాశక్తి- బూర్జ

ఖరీఫ్ సాగుకు వరుణుడు ముఖం చాటేశాడు. ఒకవైపు ప్రభుత్వంతో పాటు వరుణుడు కూడా సహకరించకపోవడంతో రైతులు తీవ్రంగా కుంగిపోతున్నారు. వలుపాలు తుపాన్లు వచ్చినా కనీస ప్రభావం చూపలేదు. దీనికితోడు రోహిణి కార్తెల ఎండలను మైమరపించేలా ప్రస్తుతం ఎండలు కాస్తున్నాయి. వరినాట్లు పూర్తిగా ఎండిపోయిన పరిస్థితి దాపురించింది. వరినాట్లను కాపాడుకునేందుకు రైతన్నలు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.

ఇంజన్లతో పొలాలకు సాగునీరు

సాగు పొలలకు దూర ప్రాంతాల్లో ఉన్న నాగావళి నది నుంచి, గ్రామాల్లో ఉన్న చెరువుల నుంచి పదుల సంఖ్యలో నీటి ఇంజన్లను పెట్టి ఆశలను చంపుకోలేక పొలాలకు తడులను అందిస్తున్నారు. బూర్జ మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లోనూ వరినాట్లు ఊబాలు పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం మండలంలోని నీలాదేవిపురం, మామిడి వలస, లంకాం, పెద్దలంకాం, కె.కె.రాజపురం, కొల్లివలస, ఉప్పిన వలస తదితర గ్రామాల్లో మండుతున్న ఎండలకు వరినాట్లు ఎండిపోయే పరిస్థితికి చేరడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల అడపాదడపా వర్షాలు పడినప్పటికి, సాగుకు అవసరమైనంత మేరకు వర్షాలు పడక పోవడంతో రైతులు వరుణదేవునికి పూజలు చేస్తున్నారు.

అందని సాగునీరు

మండలంలో వ్యవసాయం సాగుకు కాలువల ద్వారా సాగునీరు అందడం లేదు. మండలంలో ఉన్న దేశాయ్ ఛానల్, ఒని గెడ్డ, బొమ్మిక రిజర్వాయర్ల ద్వారా చుక్కనీరు రాకపోవడం దురదృష్టకరం. శివారు భూములకు సకాలంలో సాగునీరు అందిస్తామని ప్రకటనలు గుప్పించిన పాలకవర్గం, ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని భరోసా

ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి రైతులను నిండా ముంచిందని, రైతులు ఆరోపిస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి ఒక్కో రైతుకి రూ.20 వేలు అందిస్తామని చెప్పి ఒక ఏడాది భరోసా ఎగ్గొట్టారు. ఈ ఏడాది ఎంతో మంది రైతులకు సహాయం అందలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.


మోటారుతో పొలాలకు నీటిని విడిచిపెడుతున్న రైతులు

వరినాట్లు ఎండుతున్నాయి



ప్రస్తుతం వర్షాలు పూర్తిగా కురవడం లేదు. కాలువల ద్వారా సాగునీరు అందడం లేదు. వరినాట్లు ఎండుతున్నాయి. ప్రభుత్వం కన్నెత్తయినా చూడటం లేదు. ఏం చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నాం.

- పాడి శ్రీనివాసరావు, బూర్జ మండలం

ఇలాగైతే నష్టాలు తప్పవు



అప్పులు చేసి వ్యవసాయం కోసం పెట్టుబడులు పెట్టాం. వర్షాలు పడక సాగునీరు అందక వరినాట్లు ఎండి పోయిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతులను అన్నివిధాలా ఆదుకోవాలి.

పైల రమణమూర్తి, నీలాదేవిపురం

రైతుల శ్రమదానం


శ్రమదానంతో బట్టిని బాగు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని లొద్దలపేట గ్రామానికి చెందిన రైతులందరూ సాగునీటి కోసం ఆదివారం సామూహిక శ్రమదానం చేపట్టారు. గ్రామానికి చెందిన సుమారు 50 ఎకరాలకు సాగునీరు అందించాల్సిన వెంకన్న బట్టి పూర్తిస్థాయిలో పూడికతో నిండిపోవడం వలన సాగునీటి ప్రవాహం అంతంత మాత్రంగానే ఉండేది. దీంతో ఖరీఫ్ సాగులో భాగంగా వేసిన వరి పంటకు కావలసినంత సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో చేసేదిలేక వెంకన్న బట్టి పరివాహక ప్రాంత సాగునీటి రైతులందరూ స్వచ్ఛందంగా పూడికలతీతకు సంకల్పించారు. బట్టిలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు కాలువలో ఉన్న పూడికను కూడా పూర్తిస్థాయిలో తొలగించడంతో ప్రస్తుతం పూర్తిస్థాయిలో సాగునీరు ప్రవహిస్తూ పంట పొలాలకు సాగునీరు అందుతుండడంతో రైతులు పంటలపై ఆశలు నిలుపుకుంటున్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఘనంగా విప్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ జన్మదిన వేడుకలు కవిటి మండలం రామయ్యపుట్టుగలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, అనధికారులు రామయ్యపుట్టుగ చేరుకుని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ప్రగడపుట్టుగలోని కోదండ రామాలయం, కవిటి రామాలయం, చింతామణి అమ్మవారి ఆలయాలను సందర్శించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు, నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, సహచర ఎమ్మెల్యేలు విప్‌కు ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ జన్మదినం సందర్భంగా టిడిపి నాయకులు ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ముందుగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అనంతరం జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో బస్టాండ్ కూడలి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందుగా పట్టణ టిడిపి అధ్యక్షులు పత్రీ తవిటియ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాబ్జీ, టౌన్ అధ్యక్షులు పత్రీ తవిటయ్య, టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, నందిగాం కోటి, దక్కత కామేశ్వరరావు, కాళ్ల ధర్మారావు, దక్కత ఢిల్లీరావు, సహదేవరావ్‌రెడ్డి, ఆసి లీలారాణి, కాళ్ల దిలీప్, కృష్ణయ్య, నందిక జాని, రెయ్య జానికిరామ్, దట్టి శ్రీను, కె.రామారావు, జగదీష్ పాల్గొన్నారు.

అన్నవరంలో శ్రీలత నృత్య ప్రదర్శన

ఆమదాలవలస: పట్టణానికి చెందిన నృత్య కళాకారిని కూన శ్రీలత శనివారం రాత్రి ప్రసిద్ధ దేవాలయం అన్నవరంలో నృత్య ప్రదర్శన చేపట్టింది. శ్రావణ పౌర్ణమి సందర్భంగా కూచిపూడి నృత్యంలో ప్రసిద్ధిగాంచిన శ్రీలత నృత్య ప్రదర్శనను వీర వెంకట సత్యనారాయణ దేవాలయ కార్య నిర్వహణ కార్యదర్శి ప్రదర్శన కోరడం జరిగింది. ఇఒ అభ్యర్థన మేరకు డాక్టర్ ఇంత రవి బాలకృష్ణ ఆధ్వర్యంలో నాట్య శ్రీ నృత్య కళానికేతన్ నృత్య కళాకారులు సుస్మిత, చరిస్మా, ఝాన్సీ రాణి, రజిత, లోహిత, సౌమ్య ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. శ్రీలత తన శిష్య బృందంతో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనకు అభినందనలు తెలియజేస్తూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సన్మానించినట్లు ఆమె తెలిపారు.


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న బృందం

విద్యారంగ పరిరక్షణే ధ్యేయం


పలాస : జెండా ఎగురవేస్తున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- సోంపేట

యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సోంపేట ప్రభుత్వాస్పత్రి, హరిపురం వద్ద యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా యుటిఎఫ్ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాల చర్యలు ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించే దిశగా ఉండాలన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని ప్రయోగశాలగా చూడకూడదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా విధానాలు మార్చకూడదన్నారు. సమాజానికి ఉపయోగపడే విద్యను విద్యా విధానాలను రూపొందించాలన్నారు. విద్యా సంస్కరణలు బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగపడే విధం గా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.మురళీప్రకాష్, సాప కూర్మారావు, గోరకల దొరబాబు, పి.కుమారస్వామి, జి.ప్రకాశరావు, ఎల్.రవికుమార్, పి.హేమచంద్రరావు, మురళీనాయక్, రమేష్, జగదీష్ బడిత్య, సోమేశ్వరరావు, కొండలరావు, మాధవరావు, సోమనాథ్ పాల్గొన్నారు.

పలాస : విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ చిత్తశుద్ధిగా పనిచేస్తుందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కంచరాన రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ పతాకావిష్కరణ మండలశాఖ గౌరవాధ్యక్షులు కె.ప్రసాదరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, ఇప్పటివరకు ఉపాధ్యాయులు సాధించుకున్న హక్కులు, రాయితీలను నిలబట్టుకునేందుకు సైతం పోరాటం చేయాలన్నారు. యుటిఎఫ్ జిల్లా ఎకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్ వెంకటాచలం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. తాము పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను


నందిగాం : జెండాను ఎగురవేస్తున్న యుటిఎఫ్ నాయకులు


సోంపేట : జెండాను ఎగురవేస్తున్న బాబూరావు

అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, టి.అప్పారావు, ఎం.సంతోష్, వజ్రపుకొత్తూరు మండల శాఖ అధ్యక్షులు సిహెచ్.ధర్మారావు, కంచరాన జయరాం, యుటిఎఫ్ నాయకులు కె. రవీంద్ర, కె.వి.ఎస్.ప్రసాదరావు, డి.శరత్, మన్మథరావు పాల్గొన్నారు.

నందిగాం: నందిగాంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు కె.కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి వై.గణపతి, గౌరవాధ్యక్షులు కె.ధర్మారావు, జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు పాల్గొన్నారు

టెక్కలి : ఉపాధ్యాయ ఉద్యమ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని యుటిఎఫ్ ఆవిర్భావించిందని సీయర్ నాయకులు పాలవలస ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద పథకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు మారం కుమారస్వామి, అధ్యక్ష, కార్యదర్శులు పడాల గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, డొంకన పాపారావు, బాలక శంకరరావు, సత్యనారాయణ, రాము, విజయ్‌కుమార్, లక్ష్మణరావు, సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ కోటేశ్వరరావు

నాలుగు కేజీల గంజాయి స్వాధీనం

పలాస: పలాస రైల్వే స్టేషన్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన రాహుల్ బ్యూరో అనే వ్యక్తి నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పలాస రైల్వే జిఆర్‌పి ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాహుల్ బ్యూరో అనే వ్యక్తి పలాస రైల్వే స్టేషన్ లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా, రెండు బ్యాగుల్లో నాలుగు కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. నిందితుడిని అదుపులో తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి మృతి

పలాస : మండలంలోని చిన్ననీలావతికి చెందిన సొర్రా సంతోష్ కుమార్ (32) శనివారం రాత్రి మృతి చెందారు. మృతుడు నాశిక్‌లో ఆర్మీలో పని చేస్తున్నాడు. మూడురోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. ఇంతలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకు ంది. మృతుడు తండ్రి జానకిరావు కరోన సమయంలో మృతి చెందగా, తల్లి హేమలత స్వగ్రామంలో ఉంది. భార్య జయశ్రీ ఏడాది పిల్లాడుతో అండమాన్‌లో ఉంటుంది.

వృద్ధుడు ఆత్మహత్య

ఎచ్చెర్ల: మండల పరిధిలో పొన్నాడకు చెందిన నేటింటి రాముడు (65) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ వివరాల మేరకు రాముడుకు రెండేళ్ల క్రితం ఎడమకాలు విరిగిపోవడంతో ఆపరేషన్ అయింది. ఇటీవల ఆ కాలు మళ్లీ ఇబ్బంది పెట్టడంతో ఎవరిని డబ్బులు అడగడానికి ఇష్టపడక మనస్థాపానికి గురై ఈనెల 9న పొలంలో గడ్డి మందు సేవించాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో శ్రీకాకుళం సర్వజనాస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని ఇద్దరు కుమారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

పలాస: పలాస వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. 2025-27 సంవత్సరానికి నూతన అధ్యక్షునిగా డోకి నాగేశ్వరరావు, కార్యదర్శిగా తంగుడు కామేశ్వరరావు, కోశాధికారిగా కోట్ని శశి కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వైశ్య సంఘం కమిటీ సమక్షంలో ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఎన్నికపై పలాస రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డోకి రామారావు, వైశ్య సంఘం గౌరవాధ్యక్షులు మల్లా భాస్కరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ పి.వి.సతీష్, మాజీ అధ్యక్షుడు మల్లా కృష్ణారావు, పిసిఎంఎ అధ్యక్షుడు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు అభినందించారు.

సీతయ్య ఫౌండేషన్‌లో అన్నదానం

ఇచ్ఛాపురం : ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ జన్మదిన సందర్భంగా బెల్లుపడ టిడిపి నాయకులు రెయ్యి జానకిరామ్, సత్యవతి సీతయ్య ఫౌండేషన్‌లో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజు పాల్గొన్నారు.

మహిళలకు ఒరిగేదేమీ లేదు

ఇచ్ఛాపురం: కూటమి ప్రభుత్వం మహిళలకు ఒరిగేదేమీ లేదని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు ఉలాల భారతీదివ్య ఒక ప్రకటనలో విమర్శించారు. మహిళల జీవితాలు నాశనం చేసేలా చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఆలయం, పాఠశాలలు అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేశారని అన్నారు. ప్రభుత్వమే స్వయంగా మద్యం విక్రమాలు ప్రోత్సహిస్తోందన్నారు. స్త్రీ శక్తి పథకం పేరుతో ఉచిత మహిళల ప్రయాణం సగం బస్సులకే కేటాయిస్తామనడం సరికాదన్నారు. మహి ళలకు అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు.

దుస్తుల పంపిణీ

పలాస: కాశీబుగ్గ బాల సదనంలో పవన్ పుత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఆదివారం పిల్లలకు టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, సవర రాంబాబు, టంకాల రవిశంకర్ గుప్త, కొరికాన శంకర్, ఎం.నరేంద్ర, చిన్ని, బి.నాగరాజు పాల్గొన్నారు.

లావేరు పిఎసిఎస్ అధ్యక్షునిగా దాము

లావేరు: లావేరు ఎపిసిఎస్ అధ్యక్షునిగా కొత్తకుంకాం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కూనపల్లి దామోదరరావును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు వెల్లడించింది. ముగ్గురు సభ్యులతో నామినేట్ చేస్తూ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అధ్యక్షునితో పాటుగా డైరెక్టర్లుగా బుడుమూరుకు చెందిన టిడిపి నాయకుడు, మాజీ ఎంపిటిసి పండి గోపాలరావు, వెంకటాపురం గ్రామానికి బిజెపి నాయకుడు ఇప్పిలి శ్రీనువాసరావులను డైరెక్టర్లుగా నియామకమయ్యారు.

రణస్థలం: రణస్థలం రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్‌గా బొంతు విజయకృష్ణను, సభ్యులుగా పివి రత్నం, లంక వెంకటరమణ ఎంపికయ్యారు. పైడి భీమవరం పిఎసిఎస్ చైర్మన్‌గా టిడిపి నాయకులు దంతులూరి సుశీల వర్మను ఏకగ్రీవంగా నియమించారు. సభ్యులుగా డి.రవీందర్‌ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ధ్రువపత్రం లేక చదువులకు దూరం

టెక్కలి: చదువుల్లో రిజర్వేషన్ పొందాలన్నా, ప్రభుత్వ పథకాలు వర్తించాలన్నా తరగతి ధ్రువీకరణ లేకపోవడంతో వందలాది కుటుంబాలకు తమ కులం ఏమిటో తెలికపోవడంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నరసన్నపేట నియోజకవర్గ పరిధి సారవకోట మండలంలో ఆత్యధికంగా ఉన్న ఏనేటి కొండలకు ఇప్పటి వరకు తరగతి గుర్తింపు లేదు. 20 ఏళ్ల నుంచి తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో చదువులకు, ఉద్యోగాలకు వీరు దూరంగా ఉంటున్నారు. అసలు తమ కులం ఏమిటో చెప్పండి అనే వీరి ప్రశ్నకు అటు పాలకుల వద్ద, ఇటు అధికారుల వద్ద సమాధానం లేదు. జిల్లాలో ఒకప్పుడు ఎస్‌టి జాబితాలో ఉండేవారు. అయితే ఎస్‌టిలో ఇతర తరగతుల వారు చేరుతున్నారని కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టి ఏనేటి కొండలు ఎస్‌టిలుగా అనర్హులని కమిటీ నివేదిక ఇచ్చారు. దీంతో ఎస్‌టి జాబితాను తీసేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తరగతి ధ్రువపత్రాలు లేకపోవడంతో అన్నింటికీ దూరమవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తరగతి ధ్రువీకరణ పత్రం అందజేయాలని కోరుతున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి- పలాస

ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని డైరెక్టర్ కంద ప్రసాదరావు అన్నారు. పలాస బ్రాంచ్ ఆవరణలో విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ బ్యాంకులకు ధీటుగా ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాదారులకు బ్యాంకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, దీనిలో భాగంగానే ఖాతాదారులకు చెందిన పిల్లలకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నామని అన్నారు. ఈ అవార్డులు ఏటా అందజేస్తున్నామని తెలిపారు. ఈ ఒరవడిని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో


నగదు బహుమతిని అందజేస్తున్న ప్రసాదరావు

పదో తరగతిలో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున, ఇంటర్‌లో ప్రతిభ చూపిన ఏడుగురు విద్యార్థులకు రూ.7,500 చొప్పున నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ జోనల్ మేనేజర్ జక్కా శ్రీనివాసరావు, బదిలీపై తెనాలి వెళ్లన్న మేనేజర్ జి.ఎల్.వి.ప్రకాష్‌రావు, బ్యాంకు మేనేజర్ కనకమాలక్ష్మి, సిబ్బంది రంజిత్‌కుమార్, భరత్‌కుమార్, కృష్ణసాయి, శివకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన జ్ఞాన భారతి విద్యార్థులు

'జ్ఞాన భారతి' విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం: సిబిఎస్ఇ క్లస్టర్ ఏడో అథ్లెటిక్స్ పోటీలో జ్ఞాన భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు కైవసం చేసుకున్నారని కార్యదర్శి, సిఇఒ జోహార్ ఖాన్ తెలిపారు. రు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కానుగూరు అక్షర విద్యాలయ పాఠశాలలో ఈ నెల 5 నుంచి ఆదివారం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారని అన్నారు. విద్యార్థులు పతకాలు సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేశారని అన్నారు. జావిలిన్ త్రోలో 11వ తరగతి విద్యార్థి అఖిల్ యాదవ్ ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించాడని అన్నారు. 11వ తరగతి విద్యార్థి కె.ప్రవీణ్‌కుమార్ 1500 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచి రజిత పతకం గెలుచుకున్నారని తెలిపారు. పదో తరగతి విద్యార్థిని డి.లతాశ్రీ ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానాన్ని సాధించి రజిత పథకం గెలుచుకుందని చెప్పారు. జావిలిన్ త్రోలో వెండి పతకం గెలుచుకున్న అఖిల్ యాదవ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విజేతలకు, వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, కైలాస్ పండాలను జోహార్ ఖాన్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి అభినందించారు. మేనేజర్లుగా ఫాతిమా, ప్రశాంత్ వ్యవహరించారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణం మన బాధ్యత

ప్రజాశక్తి- టెక్కలి

మూఢవిశ్వాసాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి పాలకులు, ప్రజలు బాధ్యత వహించాలని, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్‌ని నిషేధించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక టెక్కలి నియోజకవర్గస్థాయి ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ ప్యాక్టరీలను నిషేధించాలని కోరారు. 2025 సైన్స్ చెకుముకి సంబరాలను విజయవంతానికి కృషి చేయాలన్నారు. జిల్లా ఆకడమిక్ కన్వీనర్ పాలవలస ధర్మారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను నిషేధించాల్సిన పాలకులు వాటి ఏర్పాటుకు ఆమెరికా వంటి సంస్థలకు స్థలాలు మంజూరు చేయడం విచిత్రమని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ బాధ్యులు కురమాన దాలయ్య, బాలక శంకరరావు, తమ్మినేని వైకుంఠరావు, డొంకాన పాపారావు, బమ్మిడి ఆరుణ్‌కుమార్, జి.మోహనరావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామేశ్వరరావు

వాహనాల ద్వారా సరుకులు అందించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మారుమూల కొండ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు వాహనాల ద్వారా రేషన్ సరుకులు సరఫరా చేయాలని గిరిజనులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వాహనాల ద్వారా ఇంటింటికీ సరుకులు అందించించేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ వాహన సౌకర్యం తీసివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీంతో రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుంది. కొండపై భాగంలోని కేరాసింగి గూడ, చందనగిరి, హడ్డివాడ, దెబ్బగుడ్డి, పెద్దకేదారి తదితర గిరిజనులు కొండల ప్రాంతాల నుంచి కిందకు దిగి కిలోమీటరు మేర నడిచి వెళ్లి డిపోలు వద్ద రేషన్ తీసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన సమస్యలపై స్పందించి వాహనం ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలో వీరన్నాయుడు కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు ప్రైవేట్ కార్పొరేట్ వైద్య సంస్థలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, కింజరాపు రామారావు, సాసుపల్లి కృష్ణబాబు, బెవర రాము, బలగ ప్రహర్ష, పోలాకి పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా స్థానిక పెద్దమార్కెట్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. మార్కెట్ మర్చెంట్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో యువత రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువతకు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అర్హత గల యువత రక్తదానం చేయటం సామాజక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు ఉండేటప్పుడు రక్తదానం ప్రాణాలు నిలబెడుతుందన్నారు. కార్యక్రమంలో కోరాడ హరగోపాల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్